ఇందిరమ్మ ఇళ్లకు కంకర తిప్పలు



2



2

అటవీ ప్రాంతంలో పెద్దపులి కలకలం

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అక్షరటుడే ఇందూరు:** నగరంలోని వినాయక్ నగర్ ఉపకేంద్రం పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ చంద్రశేఖర్ తెలిపారు. కొత్త 33 కేవీ టవర్ నిర్మాణం చేస్తున్నందున సోమవారం విద్యుత్ సరఫరాలో కోత విధించనున్నట్లు ఆయన వివరించారు. 100 ఫీట్ రోడ్డు, కామాక్షి, సాయి నిలయం, మీనాక్షి, పద్మావతి అపార్ట్‌మెంట్, భవానీనగర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ కోత ఉంటుందని పేర్కొన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.







ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

# ‘ఊర’ంతా కలిసి.. అమ్మను కొలిచి..

■ నగరంలో ఘనంగా ఊర పండుగ ■ ఊరేగింపులో భారీగా పాల్గొన్న ప్రజలు ■ ప్రత్యేక పూజలు చేసిన పలువురు నేతలు, ప్రముఖులు ■ పోలీసు బందోబస్తు ఏర్పాటు



ఇందూరు నగరంలో ఊర పండుగ నిర్వహించారు. ఖిల్లా శారదాంబ గద్దె వద్ద సర్వసమాజ్ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహాల ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణ గుప్తా, సీపీ సాయిచైతన్య, సర్వసమాజ్ కమిటీ కన్వీనర్ యెండల లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ ప్రవీణ్, ఏసీపీ రాజా వెంకటరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపులో నగరవాసులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఊరేగింపులో పంచే ‘సరి’ కోసం పోటీ పడ్డారు. ఒక ఊరేగింపు మహాలక్ష్మి నగర్ వరకు సాగింది. కాగా.. మరో ఊరేగింపు దుబ్బలోని అమ్మవారి ఆలయం వరకు కొనసాగింది. అమ్మవార్ల ఊరేగింపు సందర్భంగా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

- అక్షరటుడే, ఇందూరు







అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ సాయిచైతన్య, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి

గోల్‌హనుమాన్ వద్ద పూజలు చేస్తున్న భక్తులు

## సీఎంను కలిసిన జితేందర్ రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం మచర్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకు డు ఎర్ర జితేందర్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లిహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆదివారం సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చినట్లు జితేందర్‌రెడ్డి తెలిపారు.



## జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగరంలో ఖలీల్‌వాడిలో గల జిల్లా సంఘం భవనంలో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారతీయ పద్మశాలి సంఘం సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ దాసరి నర్సింలు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా మైసల నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు గంగా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా గాలిపల్లి నారాయణ, పాము రమేష్, అంకం జగదీష్, గంగుల దత్తాద్రి (ముప్కాల్), ఆరుట్ల రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శిగా దేవ బజరంగ్, పద్మ సుభాష్, సాంబారు తిరుపతి (నందిపేట), ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఉప్పరపల్లి నాగరాజు, ప్రచార కార్యదర్శిగా కూరపాటి వెంకట్, కోశాధికారిగా దిండిగల్ల శంకర్‌ను ఎన్నుకున్నారు. సలహాదారులుగా డాక్టర్ ఎం శ్రీహరి, డాక్టర్ కె సుభాష్, డాక్టర్ బి కేశవులు, పెంట దత్తాద్రి, గెంట్యాల వెంకటేశం, భీమర్తి రవి, కన్నా శ్రీనివాస్, ఉప్పరపల్లి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా గర్దాస్ శంకర్, ఆడెపు రాజన్న, విట్టం వెంకటరమణ(నూత్ పల్లి), జట్ల బాలరాజ్ (ఎడపల్లి ), గంజి గణేష్,(నవీపేట్ ), షేర్ పల్లి బాబురావు, గంగుల గంగాధర్, దయానంద్ (హోన్నాజీపేట్ )లను ఎన్నుకున్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కాంగ్రెస్ ఘనతే..

**అక్షరటుడే, కామారెడ్డి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంపు చారిత్రాత్మక నిర్ణయమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. దోమకొండ మండల కేంద్రంలో ఉన్న చాముండేశ్వరి ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా ఆదివారం ఆయన అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూతపడిన విజయ డెయిరీని తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కసారి కూడా రిజర్వేషన్ పెంచాలన్న ఆలోచన చేయలేదన్నారు. పదేళ్లుగా రాష్ట్రంలోని బీసీ సంఘాలతో బీఆర్ఎస్ అధినాయకులు దోబూచులాడి రిజర్వేషన్ ప్రక్రియను మూలన పడేశారని దుయ్యబట్టారు. కానీ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌ను పక్కాగా అమలు చేస్తోందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో 34 శాతం ఉన్న రిజర్వేషన్‌ను 22 శాతానికి తగ్గించారని గుర్తు చేశారు. రిజర్వేషన్లను తగ్గించి బీసీలకు తీరని అన్యాయం చేశారని ఆగ్రహించారు. కానీ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయబోతోందని స్పష్టం చేశారు. త్వరలో రిజర్వేషన్ అమలులోకి వస్తుందన్నారు.



చాముండేశ్వరి మాత ఆలయంలో పూజలు చేస్తున్న షబ్బీర్ అలీ



## బోనమెత్తిన ఎమ్మెల్యే పోచారం

**అక్షరటుడే, బాన్సువాడ:** ఆషాఢ మాసం సందర్భంగా జిల్లాలో బోనాల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బాన్సువాడలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సతీసమేతంగా బోనం ఎత్తుకున్నారు. పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో బోనాల పండుగలో పోచారం శ్రీనివాస్ రెడ్డి, భార్య పుష్పతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 15న టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు

**అక్షరటుడే ఇందూరు:** టీఎన్జీవోస్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 15న బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆదివారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 15న పాత కలెక్టరేట్‌లోని నవ దుర్గా మాత ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు సంబరం నిర్వహిస్తామని వివరించారు. కావున జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, నాల్గో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు, పెన్షనర్లు హాజరుకావాలని కోరారు. బోనాల వేడుక అనంతరం మహా అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని సుమన్ తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షుడు నారాయణరెడ్డి, టీఎన్జీవో కేంద్ర కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి దినేష్‌బాబు, జాఫర్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్, మారుతి తదితరులు పాల్గొన్నారు.



## మద్నూర్ ఎస్సైకి సన్మానం




**అక్షరటుడే, బిచ్కుంద:** కరీంనగర్‌లో రెండో జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో జిల్లా అధికారులు 11 పతకాలు సాధించారు. ఈ మీట్‌లో మద్నూర్ ఎస్సై విజయ్ కొండ రెండు వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మద్నూర్ కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు సురేష్ ఉడతవార్, మోర్ అశోక్ కుమార్‌లు ఎస్సైని సన్మానించారు.

## బంజారా సేవా సంఘం పట్టణాధ్యక్షుడికి సన్మానం




**అక్షరటుడే, బాన్సువాడ:** బంజారా సేవా సంఘం బాన్సువాడ పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన జరుపుల అంబర్ సింగ్ ను మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి సత్కరించారు. ఆదివారం ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. బంజారాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్ సింగ్ రాథోడ్, కొత్తకొండ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్మన్



**అక్షరటుడే, బిచ్కుంద:** జుక్కల్ మండలకేంద్రంలో కాంబ్లె కిరణ్ పిల్లల నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఉమ్మడి జిల్లా జెడ్పీ ఛైర్మన్ దఫేదార్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి పిల్లలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎంపీపీ నీలు పటేల్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ భాను గౌడ్, మాజీ సర్పంచ్ బొల్లి గంగాధర్, మహ్మద్ నగర్ సొసైటీ ఛైర్మన్ వాజిద్ భాయ్, మాజీ ఎంపీపీ సెట్కార్ బస్వంత్ రావు, బస్వారాజ్ పటేల్, రమేష్ పటేల్, విట్టు పటేల్, వెంకట్ గౌడ్, రమేష్ కంబ్లె, బాలాజీ, సుధాకర్, బాబన్న, తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయలతో అమ్మవారికి అలంకరణ



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండల కేంద్రంలోని పోచమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢమాసం ఆదివారం సందర్భంగా అమ్మవారికి ఓడి బియ్యం పోశారు. ఈ సందర్భంగా కూరగాయలతో అమ్మవారి విగ్రహాన్ని అలంకరించారు. వేద పండితులు సంజీవరావు, కల్పన దంపతులతో పాటు మండల కేంద్రానికి చెందిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలు రకాల వంటకాలతో నైవేద్యాన్ని సమర్పించారు.



# ఇందిరమ్మ ఇళ్లకు కంకర తిప్పలు..

■ నెలరోజుల్లో భారీగా పెరిగిన ధర ■ లబ్ధిదారులపై ఆర్థికభారం



**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అక్కడక్కడా అడ్డంకులు తప్పట్లేదు.. వ్యాపారులు ఇళ్లకు కావాల్సిన ముడి సరుకు ధరలను పెంచడంతో లబ్ధిదారులు తంటాలు పడాల్సి వస్తోంది. ఓవైపు అధికారులు ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన కంకర, సిమెంటును ధరలు అందుబాటులో ఉంచాలని సూచించినప్పటికీ.. ధరలు పెరిగిపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.**

**– అక్షరటుడే, ఇందూరు**

జిల్లాలో 16,900 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 9 వేల ఇళ్లు నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. మరో 2వేలకు పైగా ఇళ్లకు ముగ్గు వేశారు. అయితే అన్ని ఇళ్లు ఒకేసారి ప్రారంభం కావడంతో కొందరు వ్యాపారులు సిమెంటు, కంకర ధరలను పెంచుతున్నట్లు తెలుస్తోంది.

### ఉమ్మడిజిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో నెలరోజుల క్రితం ట్రాక్టర్ కంకర రూ.2,500 నుంచి రూ.2,800 వరకు లభించింది. ప్రస్తుతం మార్కెట్లో అనూహ్యంగా రూ.3 వేల నుంచి రూ. 4వేల వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులతో పాటు సాధారణ ఇళ్లు చేపట్టే వారిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.

### 400 చదరపు అడుగుల్లో..

ఇందిరమ్మ ఇళ్ల కోసం 400 చదరపు అడుగుల్లో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సూచించింది. ఈ విస్తీర్ణంలో ఇంటి నిర్మాణానికి స్లాబ్ వేయాలంటే రెండు నుంచి మూడు డాక్టర్ల 20 ఎంఎం కంకర అవసరమవుతుంది. దీంతో పాటు పునాది దశలో నేలను చదును చేసేందుకు కొందరు 40 ఎంఎం కంకరను వాడతారు. పిల్లర్లకు మరో మూడు ట్రాక్టర్లు వాడాల్సి ఉంటుంది. మొత్తంగా లబ్ధిదారులు ఒక ఇంటిని పూర్తిచేసేందుకు సుమారు 8 నుంచి 10 ట్రిప్పుల కంకర అవసరమవుతుంది.

### అవసరాన్ని ఆసరాగా చేసుకుని..

ప్రభుత్వం నిర్ణయించిన వైశాల్యంలో నిర్మించాలంటే రూ. 5 లక్షలు ఖర్చవుతుందని అంచనాలు కూడా రూపొందించింది. అందులో కంకర 20 ఎంఎం నాలుగు ట్రాక్టర్లకు రూ.14 వేలు, 40 ఎంఎం కంకర రెండు ట్రాక్టర్లకు రూ.5వేలుగా పేర్కొంది. అయితే లబ్ధిదారులు ఎలాగూ తప్పనిసరిగా తీసుకుంటారనే ఉద్దేశంతో కొందరు వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా తీసుకుంటున్నారు.




## ట్రాఫిక్ సమస్యలకు చెక్..

నగరంలో రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతోంది. దీంతో పాటు ట్రాఫిక్ సమస్యలు అధికం అవుతున్నాయి. నగరంలోని ప్రధాన రోడ్లపై పలు చోట్ల ఏర్పాటు చేసిన యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు అప్పుడప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పలుచోట్ల యూటర్న్‌ల బారికేడ్లు ఏర్పాటు చేసి మూసివేస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రగతినగర్ వద్ద యూటర్న్ బారికేడ్లు పెట్టి మూసివేశారు. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## ఆర్మూర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి కోరారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఆదివారం వినయ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని విన్నవించారు.

## 27న మాలల ఆత్మీయ సమ్మేళనం



**అక్షరటుడే, కోటగిరి :** బాన్సువాడ పట్టణంలో ఈ నెల 27న మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు మాల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యాల సంతోష్ తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మాల సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న మాలల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కార్మిక, ఉపాధి, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలోని మాలలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల సంఘం బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు మిర్జాపూర్ సాయన్న, సీనియర్ నాయకుడు మల్లూరు సాయిలు, రాష్ట్ర కార్యదర్శి గౌడి నర్సింలు, కోటగిరి, నస్రుల్లాబాద్ అధ్యక్షులు దండు భూమేష్, బాల సాయిలు, జుక్కల్ ఇన్‌ఛార్జి, జాతీయ మాలల ఐక్య వేదిక అధ్యక్షుడు గైని ప్రవీణ్, పుప్పాల సైదయ్య, పాల గంగారాం, బేగరి గంగారాం, సాయిలు పాల్గొన్నారు.

## బాన్సువాడ రూరల్ సీఐగా తిరుపతయ్య బాధ్యత స్వీకరణ



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ రూరల్ సీఐగా తిరుపతయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న తిరుపతయ్య బాన్సువాడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీఐ రాజేష్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

## రెండో టౌన్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన ముజాహిద్



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ నగరంలోని రెండో టౌన్ ఎస్‌హెచ్‌వోగా ముజాహిద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ ఎస్సైగా పనిచేసిన ఆయనను ఇక్కడకు బదిలీ ఇచ్చారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన ఇమ్రాన్‌ను నేరేడుగొండ పోలీస్‌స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ముజాహిద్‌కు స్థానిక సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఠాణా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పనిచేస్తానని తెలిపారు.



మాక్లూర్‌లో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**అక్షరటుడే, ఆర్మూర్/బిచ్కుంద:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేబినెట్ ఆమోదం తెలపడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాక్లూర్ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అలాగే బిచ్కుందలో సీఎం రేవంత్, ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.



బిచ్కుందలో..

## రెడ్డిపేట తండా అటవీ ప్రాంతంలో పెద్దపులి కలకలం

**అక్షరటుడే, కామారెడ్డి:** రామారెడ్డి మండలం రెడ్డిపేట స్కూల్ తండా అటవీ ప్రాంతంలో పులి సంచారం కలకలం రేపుతోంది. గత కొద్దిరోజులుగా తండా శివారులో పులి సంచరిస్తున్నట్టుగా ప్రజలు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ ఆవుపై పులి దాడి చేసి చంపిందని పేర్కొన్నారు. తాజాగా ఆదివారం మరోసారి ఓ ఆవుపై దాడి చేయగా.. గొంతుకు తీవ్ర గాయమైందని తెలిపారు. పెద్ద పులి సంచారిస్తోందని ప్రచారం జరగడంతో స్కూల్ తండా, భట్టు తండా, జగదాంబ తండా ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అటు వైపు వెళ్లేందుకు ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఆవుపై పులి దాడి చేసిన విషయాన్ని తండా వాసులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ విషయమై ఎఫ్‌వోడీ రామకృష్ణను సంప్రదించగా.. ఫారెస్ట్ రేంజ్ పెద్దది కావడంతో పెద్దపులి తిరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు పెద్ద పులి తిరిగినట్టుగా అడుగులు గుర్తించామని తెలిపారు. పులిని గుర్తించేందుకు అడవిలో సిసి కెమెరాలు, బోన్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరి దుర్మరణం



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జాతీయ రహదారిపై డిచ్‌పల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. చెన్నై నుంచి గురుగ్రామ్‌కు వెళ్తున్న ఓ కంటెయినర్ అద్దం పగలడంతో ఆదివారం ఉదయం డిచ్‌పల్లి వద్ద రహదారి పక్కన ఆపి పరిశీలిస్తున్నాడు. ఈ సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో కంటెయినర్ ఢీకొట్టింది. ప్రమాదంలో కంటెయినర్‌లో ఉన్న క్లీనర్ బయట పడడంతో చక్రాల కింద పడి మృతి చెందాడు. కాగా.. డ్రైవర్ గాయాలతో బయట పడ్డాడు. దీంతో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. డిచ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. క్లీనర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.